# చ - దు - వు

(చదువుకున్న వాడిననీ దిగులు చెందకూ...)

"ఈ లిఫ్ట్ ఎప్పుడు బాగవుతుందో కానీ, నా దుంప తెగుతోందండీ యీ మెట్లు ఎక్కలేకా, దిగలేకా" అన్నాడు రామ్మూర్తి మెట్ల మలుపులో ఆయాసం తీర్చుకుంటున్న వేణుగోపాల్‌తో.

"అయ్యా! మూడో అంతస్థులో వున్న మీకే అంత ఇబ్బందయితే, మరి ఏడో అంతస్థులో వుంటున్న వాడిని, నా అవస్థ ఎవరితో చెప్పు కోనూ" అన్నాడు వగరస్తూ వేణుగోపాల్. ఎలాగై తేనేం ఉస్సురనుకుంటూని మెట్లన్నీ దిగారు ఉదయం నడకకని బయల్దేరిన మిత్రద్వయం.

ఇద్దరూ ఒకే కార్యాలయంలో పనిచేసి, ఒక నెల తేడాగా పదవీ విరమణ చేసారు. ఇద్దరికీ మోకాళ్ల నొప్పులు కూడాను. రెండు కిలో మీటర్ల దూరం నడవడంకన్నా, "నడక ముగించుకుని, మళ్లీ మెట్లన్నీ ఎక్కడమెలాగా"నన్న చింతే యిద్దరినీ బాధిస్తోంది.

"ఈ వెంకట్రావు కార్యదర్శి అయిన దగ్గర నుంచి, భవన నిర్వహణ మరింత తగలడిందండీ. నిన్న ఉదయమనగా లిఫ్ట్‌పాడయితే, యింత వరకూ బాగుచేయించలేదు. ఈ ఏడుకొండలూ ఎక్కలేక నిన్నంతా ఇల్లు కదిలితే ఒట్టు" అన్నాడు వేణుగోపాల్.

"ఆ వెంకట్రావుండేది క్రింది అంతస్థులో... లిఫ్ట్ ఎలా తగలడితే వాడికేం? అదే నీళ్లు రాలేదనుకోండి. ఉరకలూ, పరుగులూ పెడతాడు వెధవ! తన అక్కసూ వెళ్లగ్రక్కాడు రామ్మూర్తి.

ఎలాగో "నడక" అయిందనిపించి, వాళ్ల ఫ్లాట్స్ వున్న భవంతి ప్రవేశించారిద్దరూ. మనసులో ఏమూలో ఆశ – "యీలోగా లిఫ్ట్ బాగయి వుండకూడదా" అని. లేదు. "లిఫ్ట్ చెడినది. బాగుచేయుచున్నాము. మీకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తూన్నాము" అని నిన్ననగా లిఫ్ట్‌కి చేరువగా గోడకి అంటించిన "కంప్యూటర్ ప్రింటవుట్" అలాగే వుంది. పనిపిల్ల పద్మ లిఫ్ట్ దగ్గర నిలబడి ఉంది పద్మని చూసిన మిత్రులిద్దరికీ ఉత్సాహం వచ్చింది.

పదవీ విరమణ చేసిన క్రొత్తలో, "దేశసేవ" చేద్దామన్న సత్సంకల్పంతో, వాళ్ల, వాళ్ల ఇళ్లల్లో పనిమనుషులుగా వున్న పద్మకి, లక్ష్మికీ చదువు నేర్పాలని ప్రయత్నించారు యిద్దరూ. పలకలు విరగడం అయింది కాని, చదువు సాగింది కాదు.

"ఈ లిఫ్ట్ చెడిందే పద్మా! ఆ అట్టమీద అదే వ్రాసి పెట్టేరు. చదువుకునివుంటే, నీకే తెలిసేది కదా! ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకున్నావు కాదు" అన్నాడు రామ్మూర్తి.

యల్లాప్రగడ రామారావు

"చదువు రాకపోతే ఎంత యిబ్బందో యిప్పటికయినా అర్థమయిందా?" జత కలిపాడు వేణుగోపాల్.

"నిన్నంతా బానే తిరిగిందయ్యా. అందుకే మీట నొక్కి సూత్తున్నాను" అంది పద్మ ఎంత పొరపాటయిందోనన్న భావం వ్యక్తమయ్యేలా.

అప్పుడు చూసారు యిద్దరు మిత్రులూ -

లిఫ్ట్ క్రింది అంతస్థులో లేదనీ, లిఫ్ట్ క్రిందకు వస్తున్నట్లు "ఇండికేటర్" సూచిస్తోందని తర్వాత ముఖాముఖాలు చూసుకున్నారు. నిన్నంతా తను, తనింట్లోనే బందీగా గడిపానన్న విషయం వేణుగోపాల్‌ని బాధిస్తే, నిన్న రెండుసార్లు మెట్లెక్కి దిగడానికి పడిన అవస్థ రామ్మూర్తికి గుర్తొచ్చింది.

ఇంతలో వూడి పడ్డాడు వెంకట్రావు. "ప్రతీదానికీ నేనే చావాలండీ! కేర్‌టేకర్ వున్నాడు. సెక్యూరిటీ గార్డులున్నారు. ఏం లాభం? లిఫ్ట్ నిన్న మధ్యాహ్నమనగా బాగయినా, యీ అట్టముక్క పీకేసే నాధుడే లేడు" అలా అంటూనే, ఆ అట్టముక్క పీకేస్తూ, గజగమనంతో క్రింది అంతస్థుకి చేరిన లిఫ్ట్‌లో ప్రవేశించారు - ముందు రామ్మూర్తీ, వెనక వేణుగోపాల్, ఆ వెనక "చదువురాని ఓడిననీ దిగులు సెందకూ..." అని కూనిరాగం తీస్తూ పద్మా.

●●●

